సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం : 27 : మే : 2025



అనుమతులు కొంత..
ఒటిమిట్ట చెరువులో రైతులకు ఉచితంగా మట్టి తరలింపు అనే ముసుగులో మూడురోజుల నుంచి కూటమి నేతలు ఇరిగేషన్ అనుమతులకు విరుద్ధంగా మట్టిని దోచేస్తున్నారు. - 8లో



కొడుకు కాజేసిన ఆస్తిని ఇప్పించండి
తనకు తెలియకుండా కొడుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని తిరిగి తనకు ఇప్పించాలని ఓ వృద్ధుడు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను వేడుకున్నాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.127
రెండోరకం	రూ.70	రూ.90



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1376 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	435	520
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 156.800 కిలోలు

న్యూస్‌రీల్

మామిడి పంటకు ధర కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు, వ్యాపారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలో మామిడి పంటలకు ధర కల్పించాలని సోమవారం మామిడి రైతులు, వ్యాపారులు స్థానిక ప్రైవేటు మార్కెట్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు కె మణి మాట్లాడుతూ జూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం మామిడి కాయల కోత తర్వాత కుట్రపూరితంగా ధరలు తగ్గిస్తూ రైతులు, వ్యాపారులు నష్టపోయే విధంగా కుట్రలు చేస్తోందన్నారు. మామిడి కాయలను తోలు కొని ధరల్లో వ్యత్యాసాలు చూపడం తగదన్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు తక్షణమే పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లాలో జరగనున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన సీఎం చంద్రబాబునాయుడు సాయంత్రం 7:35 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. కడప విమానాశ్రయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌లు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీఎం మహానాడు ప్రాంగణానికి సాయంత్రం 7.40 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : బిందు, తుంపర సేంద్య పరికరాలు కావాల్సిన రైతులు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా పొందాలని వైఎస్సార్ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు కోరిన కంపెనీ ఎంపిక చేసుకుని పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏపీ ఎంఐపీ ద్వారా నిర్ణయించబడిన సబ్సిడీ ప్రకారం పట్టాదారు పాసుపుస్తకంలో 5 ఎకరాల వరకు పొలం కలిగిన చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ, ఇతరులకు 90 శాతం సబ్సిడీ, అలాగే మధ్య రకం రైతులు 5 నుంచి 10 ఎకరాల పొలం గల రైతులకు 90 శాతం, పెద్ద రైతులు అంటే 12.5 ఎకరాలు గల రైతులకు 50 శాతం సబ్సిడి ద్వారా డ్రిప్పు పరికరాలు అందజేస్తామన్నారు. పేరు నమోదు చేసుకున్న రైతుల పొలాల్లో ప్రాథమిక తనిఖీ జరిగిన తరువాత రైతు చెల్లించాల్సిన రైతు వాటా రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సంక్షిప్త సమాచారం వస్తుందని వివరించారు.

భగీరథయత్నం.. భగ్నం

- విజయనగర రాజుల తర్వాత ఉమ్మడి చిత్తూరుజిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అతిపెద్ద రిజర్వాయర్లు
- అర్ధంతరంగా ఆగిపోయి కళతప్పిన వైనం
- రైతులకు పరిహారం, పునరావాసం కోసం రూ.267 కోట్లు కేటాయింపు
- అభివృద్ధి ఓర్వలేక టీడీపీ నేతల కుట్రలు.
- అటవీ అనుమతుల అవసరం లేకున్నా ఎన్జీటీలో కేసు



ఆగిపోయిన ముదివేడు రిజర్వాయర్ పనులు

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో విజయనగర రాజుల కాలంలో నిర్మించిన చెరువులు తర్వాత వాటికి మించిన నీటిపారుదల రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షించడమే శాపమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు, రైతులకు మంచి జరగాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో మూడు రిజర్వాయర్ల మంజూరు చేయడాన్ని పచ్చనేతలు జీర్ణించుకోలేకపోయారు. కుట్రలు పన్ని ఎన్జీటీలో కేసు వేసి అడ్డుకుని కళకళలాడాల్సిన రిజర్వాయర్లకు జీవం లేకుండా చేశారు. అడ్డంకులు లేకుండా ఉంటే ఈపాటికి పనులు పూర్తయి రైతులకు ప్రయోజనం చేకూరేది. 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. బీళ్లన్నీ సాగులోకి వచ్చేవి. టీడీపీ నేతలు కేసులతో అడ్డుకోడం ద్వారా రైతాంగానికి సాగునీటి కష్టాలు ఎన్నటికీ తీరకుండా చేశారు. అసంపూర్తి పనులతో కళతప్పిన నిర్మాణాలు రైతులు చేసిన పాపమేమిటని మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

అటవీ అనుమతుల అవసరం లేకున్నా..

ఈ మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి అటవీ అనుమతుల అవసరం లేదని ప్రతిపాదనల్లోనూ, మంజూరు తర్వాత నీటి పారుదలశాఖ అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. అయితే పర్యావరణ అనుమతుల పేరుతో కేసులు వేసి అడ్డుకున్నారు. పనులు నిలిపివేయాలని ఎన్జీటీ ఉత్తర్వుతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కోట్ల విలువైన మెటీరియల్, నిర్మాణ పనుల సామగ్రి వృథాగా మిగిలాయి.

ముందే పరిహారానికి నిధులు

తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో మూడు రిజర్వాయర్ల పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి సేకరించిన భూమికి, ఇళ్లు కోల్పోతున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కలంగా నిధులు కేటాయించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడు రిజర్వాయర్ కోసం 1,123 ఎకరాల భూసేకరణ, 190 మందికి పునరావాసం కోసం రూ.154.80 కోట్లు, చిత్తూరుజిల్లా పుంగనూరు మండలంలోని నేతికుంటపల్లె రిజర్వాయర్ కోసం 762.37 ఎకరాల భూ సేకరణ, 30 మందికి పునరావాసం కోసం రూ.28.63 కోట్లు, సోమల మండలంలోని ఆవులపల్లె రిజర్వాయర్ కోసం 1,520.29 ఎకరాల భూ సేకరణ, 224 మందికి పునరావాసం కోసం రూ.84.11 కోట్ల నిధులను ప్రాజెక్టులకు మంజూరు చేసిన మొత్తం నిధుల్లోనే కేటాయింపు చేసి మంజూరు చేశారు. పరిహారం, పునరావసం కోసం అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టారు. అదే సమయంలో కోర్టులో టీడీపీ నేతలు కేసు వేయడంతో రిజర్వాయర్ల పనులతో పాటు ఈ చర్యలు ఆగిపోయాయి. ఇప్పుడేమో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదని గగ్గోలు పెడుతున్నారు. పనులు అడ్డకుని నిలిపివేయించిన టీడీపీ నేతలే ఈ సమస్యకు కారణమని తెలుస్తున్నా గత ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారు.

ఇప్పటికే పూర్తయ్యేవి


టీడీపీ నేతలు కుట్రలు, కుతంత్రాలతో మూడు రిజర్వాయర్ల పనులను అడ్డుకోకుండా ఉంటే పనులు పూర్తయి రైతుల ఆర్థిక స్థితిగతులు మారిపోయి ఉండేవి. కోర్టు కేసుతో చురుగ్గా సాగుతున్న పనులను 2023 మే 11 నుంచి నిలిపివేశారు. దీంతో 2 టీఎంసీల నీటి సామర్థ్యం, 35 వేల ఎకరాల ఆయకట్టుతో ముదివేడు రిజర్వాయర్, ఒక టీఎంసీ నీటి సామర్థ్యంతో 15 వేల ఎకరాల ఆయకట్టుతో నేతికుంటపల్లె రిజర్వాయర్, 3.5 టీఎంసీల నీటి సామర్థ్యం, 60 వేల ఎకరాలు ఆయకట్టుతో ఆవులపల్లె రిజర్వాయర్ పూర్తయ్యేవి. కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే ఈ రిజర్వాయర్ల కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

సాధించిందేమిటి?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన రిజర్వాయర్ల పనులు అడ్డుకోవడం ద్వారా టీడీపీనేతలు సాధించిందేమిటో కాని రైతాంగానికి తీరని అన్యాయం జరిగింది. విజయనగర రాజుల కాలం తర్వాత ఈ ప్రాంతానికి అతిపెద్ద రిజర్వాయర్లు మంజూరై పనులు మొదలైతే రైతులు ఆనందంగా ఉండేవారు. పనులు చేపట్టినప్పటి నుంచి ఒక్క రైతు నుంచి వ్యతిరేకత లేదు. పరిహారం కోసం ప్రశ్నించలేదు. తమ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం జరగబోతోందన్న సంతోషంతో ఉన్నారు. ఇటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేపట్టడం, దానికి వ్యతిరేక వ్యక్తం కాకపోవడంతో టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించి పనులను అడ్డుకుని కరువు ప్రాంతానికి తీరని అన్యాయం చేశారు.

2023 మే 11 నాటికి పరిస్థితి

ముదివేడు రిజర్వాయర్



మంజూరు	: రూ.759.50 కోట్లు
పని విలువ	: రూ.500.30 కోట్లు
ఎల్ఏ, పునరావాసం	: రూ.154.80 కోట్లు
మిగతా వ్యయం	: రూ.104.40 కోట్లు
జరిగిన పని	: రూ.167.30 కోట్లు
మిగిలిన పని	: రూ.332.32 కోట్లు

నేతికుంటపల్లె రిజర్వాయర్



మంజూరు	: రూ.717.80 కోట్లు
పని విలువ	: రూ.571.810 కోట్లు
ఎల్ఏ, పునరావాసం	: రూ.28.63 కోట్లు
మిగతా వ్యయం	: రూ.117.36 కోట్లు
జరిగిన పని	: 472.95 కోట్లుఒ
మిగిలిన పని	: 98.86 కోట్లు

ఆవులపల్లె రిజర్వాయర్



మంజూరు	: రూ.667.20 కోట్లు
పని విలువ	: రూ.481.09 కోట్లు
ఎల్ఏ, పునరావాసం	: రూ.84.11 కోట్లు
మిగతా వ్యయం	: రూ.101 కోట్లు
జరిగిన పని	: 28.16 కోట్లు
మిగిలిన పని	: 453.93 కోట్లు

సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను సత్వరం బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగా నేర్చుకో..ఆయుస్సు పెంచుకో
దైనందిన జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతతోపాటు మనిషి ఆయుస్సు కూడా పెరిగేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. యోగాపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 28వ తేదీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లు, ఆశా, హెల్త్ వర్కర్లు తదితరులు ఐదువేల మందితతో మదనపల్లె బీటీ కాలేజీ గ్రౌండ్‌లో ఒకేచోట యోగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందన్నారు.

దయనీయంగా ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ల పరిస్థితి

– అప్నా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.ఏవీ సుబ్బారెడ్డి



మదనపల్లె రూరల్ : విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించి, దేశానికి తిరిగివచ్చిన వైద్య విద్యార్థుల పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో దయనీయంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్(అప్నా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగొచ్చిన విద్యార్థులు నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఒక ఏడాది ఇంటర్న్‌షిప్(హౌస్‌సర్జన్) పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో అనిశ్చితి కారణంగా ఏడాది హౌస్‌సర్జన్ పూర్తిచేసినప్పటికీ, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ లభించక పోవడంతో అనేక వ్యయప్రయాసలకు ఓర్చి వైద్యవిద్యను అభ్యసించిన వారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఎనిమిది నెలలుగా ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ చేస్తున్న ఆందోళనపై ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ లోతైన అధ్యయనం చేశాక, వారికి అన్యాయం జరుగుతోందని తెలుసుకుని అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ చాలా స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్‌కు మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇస్తుండటంతో వారు మెడికల్ పీజీ ఎంట్రన్స్ రాసేందుకు అర్హులవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. పీజీ ఎంట్రన్స్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు పదిరోజుల గడువు ఉన్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వేలమంది ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్లు విద్యాసంవత్సరాన్ని నష్టపోతారన్నారు. ఈ విషయమై మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్.శ్రీహరిరావును కలిసి, ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ల సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి సమాచారంతో వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. దానిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

టీడీపీ..మహా కవ్వింపు!





అంబేద్కర్ సర్కిల్‌లో మాలమహానాడు నేతల నిరసన, వైఎస్సార్ సర్కిల్‌ను చుట్టేసిన టీడీపీ జెండాలు

- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పచ్చ తోరణాలు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అశోక చక్రాన్నీ వదలని 'తమ్ముళ్లు'
- రగిలిపోతున్న అభిమానులు... మాల మహానాడు నేతల నిరసన
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం



కడప నగరం వై జంక్షన్‌లోని అశోకస్థూపానికి..

సాక్షి ప్రతినిధి, కడప : మహానాడు సందర్భంగా కడపలో టీడీపీ కవ్వింపు చర్యలకు దిగుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలతో పాటు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, దేశ చిహ్నమైన అశోక చక్రాన్ని కూడా అవమానిస్తున్నారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ప్రచార పిచ్చి అందరి మనోభావాలు దెబ్బతినేలా చేస్తోంది. ప్రతి సర్కిల్‌లో పసుపు జెండాలు కట్టి అన్ని వర్గాలనూ రెచ్చగొట్టే పనిలో పడింది. నేటి నుంచి మూడు రోజుల పాటు కడపలో చేపట్టనున్న మహానాడు కోసం నగరంలో ప్రతి చోటా ఫ్లెక్సీలు, జెండాలతో నింపేస్తున్న టీడీపీ నేతలు, మహనీయులను కూడా అవమానపరుస్తున్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డాలో మేం జెండా ఎగురవేశాం అని చెప్పుకునేందుకు టీడీపీ నానా తంటాలు పడుతోంది. గత ఎన్నికల్లో ఎలాగోలా గట్టెక్కినా టీడీపీ, ఇప్పుడు తామేదో గొప్ప విజయం సాధించినట్లు కడపలో మహానాడు నిర్వహించుకుంటోంది. అంతవరకూ సరే అనుకున్నా, దీని కోసం ప్రత్యర్థి పార్టీలను, వివిధ వర్గాలను రెచ్చగొట్టే చర్యలకు దిగడం సమస్యాత్మకంగా మారుతోంది. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ప్రచార పిచ్చి మహనీయులను సైతం అవమానపరిచే స్థాయికి వెళ్లింది. నగరంలోని అలంఖాన్‌పల్లి సర్కిల్, కృష్ణాపురం సర్కిళ్లలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలు ఉన్నాయి. ఆ విగ్రహాలకు కూడా పసుపు జెండాలు కట్టడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.

మహనీయుడికి పసుపుతోరణం
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్నీ అవమానించడంపై అంబేడ్కర్ వాదులంతా మండిపడుతున్నారు. కడపలో ఎమ్మెల్యే ప్రచార ఆర్భాటంలో మహనీయులను అవమానపరచడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కడప నగరంలోకి అంబేద్కర్ విగ్రహం చుట్టూ టీడీపీ జెండాలు కట్టడం ఇప్పుడు ఆయన అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పించింది. అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ తీరును నిరసిస్తూ నేలపై కూర్చుని మాలమహానాడు నేతలు నిరసన తెలిపారు. మహాత్మగాంధీ, ప్రకాశం పంతులు, సైనిక్ సర్కిల్, అన్నమయ్య విగ్రహం ఇలా అన్నీ విగ్రహాలను పసుపుమయం చేశారు. అన్ని వర్గాల మనోభావాలు దెబ్బతింటున్నా పట్టించుకోని అధికారులు.. పైగా మహానాడు సేవలో మునిగి తేలుతుండడం గమనార్హం.

రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలి

ఎవరి పార్టీపై వారికి అభిమానం ఉండటం సహజమే. హద్దులు దాటి పక్కవారిని రెచ్చగొట్టేలా ప్రయత్నించడం సరైంది కాదని విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలు మంచిది కాదని హితవు పలుకుతున్నారు. ఇదిలా ఉంటే నిత్యం మహానాడు పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగం ఇలాంటి చర్యలను ఎలా సమర్థిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది. ఒక్క వైఎస్సార్ విగ్రహమే కాదు... చివరికి దేశ చిహ్నమైన అశోకచక్రంతో కూడిన వై జంక్షన్ సర్కిల్‌ను కూడా పసుపు జెండాలతో కప్పేయడం గమనార్హం. అలాగే మరో అడుగు ముందుకు వేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పసుపు మయం చేసేశారు.

'ప్రత్యేక' పిల్లల్లో.. మానసిక వికాసం

- భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్తు
- జిల్లాలో 30 కేంద్రాలు
- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటపాటలతో విద్య



రాజంపేటలోని భవిత కేంద్రం

రాజంపేట టౌన్ : తల్లిదండ్రులకు తమ పిల్లలే ప్రపంచం. వారి భవిష్యత్తు బాగుండాలని వారు ఎంతైనా కష్టపడతారు. ఇక మానసిక ఎదుగుదల లేని చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలను అనుక్షణం అంటిపెట్టుకొని వారి బాగోగులు చూసుకుంటూ ఉంటారు. అనునిత్యం వారి ఎదుగుదలపై ఆందోళన చెందుతూ ఉంటారు. అయితే అలాంటి చిన్నారుల కోసమే ప్రతి మండలంలో భవిత కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 30 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడతారు. ఆటపాటలతో కూడిన విద్యా బోధన, స్పీచ్ థెరపీ, ఫిజియో థెరపీ సేవలను అందిస్తారు.

జిల్లా వ్యాప్తంగా సాగుతున్న సర్వే
ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించి మంచి భవిష్యత్తు కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ఐఈఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు భవిత కేంద్రానికి పిల్లలను పంపిస్తే వివిధ పథకాలు పొందవచ్చని, ఆటపాటలతో కూడిన విద్యాబోధన, మౌలి క వసతులు తదితర వివరాలను తెలియ చేస్తున్నారు. అందువల్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించేందుకు ముందుకు వస్తున్నట్లు ఐఈఆర్పీలు చెబుతున్నారు.

అనేక ప్రయోజనాలు
మానసిక వైకల్యం, చెవుడు, మూగ, పోలియో తదితర లోపాలతో జన్మించి భవిత కేంద్రంలో చేరిన పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తారు. వారిలో మనోధైర్యాన్ని నింపుతూ భవిష్యత్తుపై ఆశలు నింపుతారు. వినూత్న కార్యక్రమాలతో దాదాపు సాధారణ పిల్లల్లాగే చదువుకునేలా, ఆడుకునేలా అక్కడి ఐఈఆర్పీలు కృషి చేస్తారు.

ఫిజియో థెరపితో శారీరక సేవలు
ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పాఠశాల విద్యతో పాటు వారంలో ఒకరోజు ఫిజియో థెరపి సేవలను అందిస్తారు. దీని ద్వారా దివ్యాంగ పిల్లల్లో శారీరక మార్పు జరిగి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అలాగే అవసరాన్ని బట్టి చెవుడు, మూగ, పోలియో వంటి శారీరక రుగ్మతలకు ప్రత్యేక శస్త్ర చికిత్సలు చేస్తారు. ఈసేవలతో పాటు మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లలకు, పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చే తల్లిదండ్రులకు ఎస్కార్ట్, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం ఇస్తుంది. ఇక్కడికి రాలేని పిల్లలకు ఐఈఆర్పీలు వారి ఇంటివద్దకే వెళ్లి విద్య నేర్పడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తారు. ఇంటివద్ద విద్య నేర్చుకునే పిల్లలకు కూడా ప్రభుత్వం అలవెన్స్ ఇస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



మానసిక, శారీరక దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు విధిగా భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఈ కేంద్రాలు వరంలాంటివి.వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఈవిద్యా సంవత్సరంలో జిల్లాకు ఐదు ఆటిజం కేంద్రాలు కూడా మంజూరయ్యాయి.

– కొన్నిపాటి జనార్దన్, సమ్మిళిత సహిత విద్య కో–ఆర్డినేటర్, అన్నమయ్యజిల్లా

ఖనిజ నిక్షేపాలపై కేంద్రం అన్వేషణ

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించి కొత్తపల్లె గ్రామ పరిసరాల్లో సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారులు ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు ప్రారంభించారు. ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని 20 అడుగుల లోతు వరకు బోర్లు వేసి ఖనిజాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ఇందుకోసం అనేక వాహనాలను ఏర్పాటు చేశారు. ముందుగా సంబంధిత రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని పనులను ప్రారంభించారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అధికారులు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో హెలికాప్టర్ ద్వారా పర్యటించి ఖనిజాలు నిక్షేపాలు ఉండొచ్చని చూపించిన జియోట్యాగ్ ఆధారంగా ప్రస్తుతం పరిశీలన చేస్తున్నారు.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


ఎస్.లలితమ్మ (ఫైల్)

కలకడ : మండల పరిధిలోని నడిమిచెర్ల పంచాయతీ అడవిలో దళితవాడకు చెందిన ఎస్.వెంకటరమణ భార్య లలితమ్మ (44) గత నెల 2వతేదీ నుంచి కనిపించడం లేదు. ఇంటి నుంచి వెళ్లిన ఆమె కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల విచారించినా ఫలితం లేదు. దీంతో లలితమ్మ కుమారుడు మహేష్ సోమవారం కలకడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు కలకడ ఎస్ఐ నంబర్ 9440944713కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నీటి కుంటలో పడి మహిళ మృతి

పెద్దమండ్యం : నీటికుంటలో ప్రమాదవశాత్తు పడి ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని వెలిగల్లులో సోమవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెలిగల్లులో నివసిస్తున్న మునిస్వామి భార్య సాలమ్మ (70) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. గత మంగళవారం ఇంటి నుంచి వెళ్లి పోయింది. గ్రామానికి సమీపంలోని ఊటకుంటలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో సోమవారం శవమై కనిపించింది. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుమార్తె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు


ప్రమాదంలో బోల్తా పడిన కారు

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారిలోని అప్పారాజుపేట సమీపంలో సోమవారం మధ్యాహ్నం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. తిరుపతి నుంచి రాజంపేటకు వెళ్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీ కొనడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి పుల్లంపేట పోలీసులు చేరుకొని గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమతులు కొంత.. మట్టి తరలింపు కొండంత!

ఒంటిమిట్ట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచింది. అప్పటి నుంచి రెడ్‌బుక్ పరిపాలన మీద పెట్టిన ధ్యాస ప్రజా పరిపాలనపై పెట్టకుండా అక్రమార్జనకు కూటమి నేతలు నేనంటే నేను అంటూ వరుస పెడుతున్నారు. ప్రజలనే కాకుండా జల వనరులను కూడా దోచుకునే విషయంలో ఏమాత్రం తగ్గకుండా ఉన్నారు. ఇసుక, మట్టి, అడవిని కూడా దోచుకునేందుకు వెనుకాడటం లేదు. దోచుకుని దాచుకోవడంలో కూటమినేతల తరువాతనే మరెవరైనా అనే విధంగా మండలంలో నేతలు వ్యవహరిస్తున్నారు. ఇదే తంతు ఒంటిమిట్ట మండల కేంద్రంలో జరుగుతోంది. మండల కేంద్రమైన ఒటిమిట్ట చెరువులో రైతులకు ఉచితంగా మట్టి తరలింపు అనే ముసుగులో మూడురోజుల నుంచి కూటమి నేతలు ఇరిగేషన్ అనుమతులకు విరుద్ధంగా మట్టిని దోచేస్తున్నారు. రైతులకు ఉచితం అంటూ ఆదేశాలు ఉన్నా ఇక్కడి కూటమి నేతలు మాత్రం ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్ మట్టికి రూ. 600 లెక్కన రైతుల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. భారీ యంత్రాలతో ట్రాక్టర్లకే కాకుండా పెద్దపెద్ద టిప్పర్లకు మట్టిని పోసి తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతులు ఉన్న పొలాలకు మాత్రమే మట్టి తరలించాలన్న నిబంధన ఉంది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రెండు గ్రామాలలోని ముగ్గురు రైతులకు మాత్రమే అనుమతి ఇవ్వగా దానికి విరుద్ధంగా అనుమతులు లేని గ్రామాలకు కూడా మట్టిని తరలించి కూటమి నేతలు రోజుకు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతుల ముసుగులో ప్రతి రోజు దాదాపు 500 ట్రిప్పులపైబడి అక్రమ మట్టి రవాణా చేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా మట్టి మాఫియా జరుగుతుందన్న సమాచారం సంబంధిత అధికారులకు తెలిపినా వారి వద్ద నుంచి ఎలాంటి చలనం లేకపోవంతో సంబంధిత అధికారులకు భారీ ముడుపులు ముట్టాయని మండలంలో చర్చ జరుగుతోంది.


ఒంటిమిట్ట చెరువులో మట్టిని తరలించేందుకు ఉపయోగించిన జేసీబీ


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

ముగ్గురు రైతులకు మాత్రమే అనుమతి..

మట్టి తరలింపుపై మండలంలోని సాలాబాదు, ఒంటిమిట్ట గ్రామ రైతులుగా ఉన్న ముగ్గురికి మాత్రమే మూడు రోజుల క్రితం ఒంటిమిట్ట చెరువులో వారి పొలాలకు మట్టి తరలించుకునేందుకు అనుమతి ఇచ్చామని ఒంటిమిట్ట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

జేసీబీ సహకారంతో చెరువులో మట్టిని తరలించొచ్చు..

రైతులకు ఉచితంగా మట్టిని తరలించే విషయంలో జేసీబీని వాడుకోవచ్చు. ట్రాక్టర్లే కాకుండా టిప్పర్లను కూడా రవాణాకు ఉపయోగించవచ్చు. రైతులకు పూర్తి ఉచితంగా మట్టిని తరలించాలి. ఒక క్యూబిక్ మీటర్‌కు కేవలం ఒక రూపాయి మాత్రమే రైతు ప్రభుత్వానికి చెల్లించాలి. వారు చెల్లించిన రూపాయి కూడా మళ్లీ తిరిగి వారి ఖాతాలోకి జమ చేస్తాము. మూడు రోజులపాటు 500 క్యూబిక్ మీటర్ల వరకు తవ్వుకోమని అనుమతి ఇచ్చాం. అలా కాకుండా అనుమతులకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కిషోర్, ఇరిగేషన్ శాఖ ఏఈ

కొడుకు కాజేసిన ఆస్తిని ఇప్పించండి

సీనియర్ సిటిజన్స్ కోర్టులో సబ్ కలెక్టర్‌కు వినతి


సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను వేడుకుంటున్న వృద్ధుడు మల్‌రెడ్డి

మదనపల్లె రూరల్ : తనకు తెలియకుండా కొడుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని తిరిగి తనకు ఇప్పించడంతో పాటు కుమారుడి నుంచి జీవనభృతి వచ్చేలా చూడాలని ఓ వృద్ధుడు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను వేడుకున్నాడు. సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కోర్టు నిర్వహించారు. అందులో భాగంగా నిమ్మనపల్లె మండలం సామకోటవారిపల్లె పంచాయతీ ఎర్రంవారిపల్లెకు చెందిన ఎస్.మల్‌రెడ్డి (87) సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన భార్య కమలమ్మ చాలాకాలం క్రితమే చనిపోయిందని, తనకు ముగ్గురు కుమార్తెలు రాణి, లక్ష్మీదేవి, చంద్రకళతో పాటు కుమారుడు ఆనందరెడ్డి ఉన్నాడన్నారు. కుమార్తెలందరికీ పెళ్లిళ్లు అయిపోయాయని, కుమారుడు ఆనందరెడ్డి తిరుపతిలో స్థిరపడ్డాడన్నారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలో ఖాతా నంబర్.149, సర్వేనంబర్. 1094/3లో 1.36, సర్వే నంబర్. 1094/5బి లోని 0.76 సెంట్లు మినహా.. తన పేరు మీద ఉన్న ఆస్తులన్నీ కుమారుడు ఆనందరెడ్డికి రాసి ఇచ్చానన్నారు. తన వద్ద ఉన్న నగదును కుమారుడికే ఇచ్చివేశానన్నారు. ఏడాది క్రితం ఖాతా నంబర్.149లో ఉన్న 2.12 సెంట్ల భూమిని కుమారుడు ఆనందరెడ్డి తనకు తెలియకుండానే తన పేరుపై మార్చుకున్నాడన్నారు. అప్పటి నుంచి తనను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ ఇంటి నుంచి తరిమేశాడన్నారు. దీంతో ఒంటరి జీవితం అనుభవించలేక, ప్రస్తుతం మదనపల్లెలోని చిన్నకుమార్తె చంద్రకళ వద్ద ఉంటున్నట్లు తెలిపారు. ఆస్తిపాస్తులు లాగేసుకుని, తనను ఏమాత్రం పట్టించుకోని కుమారుడు ఆనందరెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను రాసి ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్ రద్దుచేసి తిరిగి తనకు అప్పగించడమే కాకుండా తన జీవనం కోసం కుమారుడి నుంచి జీవనభృతి ఇప్పించి ఆదుకోవాలన్నారు.

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి


మృతి చెందిన అప్సర్‌పాషా

పీలేరు రూరల్ : విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం మదనపల్లె మార్గం ఏపీఐఐసీ 3వ లేఅవుట్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం తిలక్‌వీధిలో కాపురం ఉంటున్న అఫ్సర్‌పాషా (40) రోజువారి పనుల్లో భాగంలో ఏపీఐఐసీ 3వ లేఅవుట్‌లో ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. గమనించి సహచర కూలీలు చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి భార్య ఫాతిమా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

నిర్ణీత సమయంలోగా ఫిర్యాదులను పరిష్కరించాలి

అదనపు ఎస్పీ వెంకటాద్రి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నష్టాల సేద్యం.. యువరైతు బలవన్మరణం


రాహుల్ రెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : ఆరుగాలం కష్టపడి సేద్యం చేసే రైతన్నలు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక జీవితంపై విరక్తి చెంది అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ బురదవాండ్లపల్లికి చెందిన గంగిరెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డి 25) బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేటు ఉద్యోగం కన్నా స్వగ్రామంలోనే వ్యవసాయం చేద్దామని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో సొంత పొలంతో పాటు చుట్టు పక్కల ఉన్న పొలాలను కౌలుకు తీసుకున్నాడు. సుమారు 25 ఎకరాల్లో టమాటా, దోస, పుచ్చకాయ లాంటి పంటలను సాగు చేసేందుకు రూ.20 లక్షల దాకా పెట్టుబడి పెట్టాడు. ఈ తరుణంలో కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కాపునకు వచ్చాయి. దిగుబడి బాగానే ఉన్నా సాగు చేసిన పంటలకు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. అష్ట కష్టాలు పడి రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన పంటల ధరలు గణనీయంగా పడిపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న యువ రైతు రాహుల్‌రెడ్డి వ్యవసాయ బోరుకు వద్దకు వెళ్లి గడ్డి మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు హుటాహుటిన బి.కొత్తకోట, మదనపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయిచారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం తనువు చాలించాడు. మృతుడి పెద్దనాన్న వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు పీటీఎం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి


రాణి (ఫైల్)

మదనపల్లె రూరల్ : భర్త వేధింపులు భరించలేక, క్షణికావేశంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వివాహిత ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కర్నాటక రాష్ట్రం చింతామణికి చెందిన రాణి(30) భర్తతో విడాకులు తీసుకుని కుమార్తె లేఖన, కుమారుడు సుమిత్‌తో వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో మూడేళ్ల కిందట సత్యసాయిజిల్లా పాలసముద్రం మండలం బోయలపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్‌తో రాణికి పరిచయం ఏర్పడి సహజీవనం చేసేంతవరకు వెళ్లింది. అయితే అశోక్‌కు అంతకు మునుపే తంబళ్లపల్లెకు చెందిన మౌనిషాతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భిణిగా ఉంది. కొద్దిరోజుల క్రితం అశోక్‌కు ప్రమాదంలో కాలు విరగడంతో రాణి దగ్గరుండి చికిత్స చేయించి, కోలుకున్నాక స్వగ్రామంలో విడిచిపెట్టింది. తల్లిదండ్రుల సూచన మేరకు అశోక్‌తో సహజీవనం వద్దనుకుని బెంగళూరుకు వెళ్లి కూలిపనులు చేసుకుంటోంది. ఈనెల 22న గురువారం అశోక్ రాణికి ఫోన్‌చేసి నీతో మాట్లాడాలని కోరడంతో కుమార్తె లేఖనను వెంటతీసుకుని 23 వ తేదీ శుక్రవారం మదనపల్లెకు వచ్చింది. ఇద్దరూ కలుసుకున్నాక, తమ బంధం కొనసాగింపు విషయమై గొడవపడ్డారు. నీ వేధింపులు నేను భరించలేనంటూ మనస్తాపంతో రాణి కుమార్తెను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కోసం పట్టణమంతా వెతికి కనిపించకపోవడంతో రాత్రి ఊరికి వెళ్లేందుకు అశోక్ ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో రాణి కనిపించడంతో మరోసారి ఆమెతో గొడవకు దిగాడు. దీంతో ఆవేశంతో రాణి బస్టాండ్ వెనుక వైపు ఉన్న కోమటివానిచెరువు కట్ట వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ప్రమాదంలో ఆమె శరీరం 70 శాతానికి పైగా కాలిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, టూటౌన్ పోలీసులు ఆమె నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది.

స్వచ్ఛ మహానాడు కోసం మంత్రుల సమీక్ష

కడప రూరల్ : కడపలో నిర్వహిస్తున్న మహానాడులో స్వచ్ఛ మహానాడు కోసం క్లీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ ఏర్పాట్లను సోమవారం మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ మహానాడు కార్యక్రమం కోసం మంత్రులు డ్రెస్ కోడ్ జాకెట్‌లను ధరించి అనుసరించాల్సిన విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల మంత్రులు వాసంశెట్టి సుభాష్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, పట్టాభిరామ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు పురిషిత్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పురిషిత్‌రెడ్డి (13) అనే బాలుడు మృతి చెందాడు. వరికసువుపల్లికి చెందిన ఎర్రవ్వగారి సుధాకర్ కుమారుడు పురిషిత్‌రెడ్డి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా బి.కొత్తకోట నుంచి టి.సదుం వైపు వెళుతున్న ఓ లారీ వేగంగా దూసుకు వచ్చి బాలుడిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు వెంటనే లారీని వెంబడించి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వైఎస్ విగ్రహాలకు కట్టిన పసుపు జెండాలు తొలగించకుంటే ఆందోళన

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరు : మహానాడు సందర్భంగా విచ్చల విడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న టీడీపీ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పసుపు జెండాలు, తోరణాలను కట్టడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడపలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎవరైనా జెండాలు గానీ, లేక మరేవైనా కట్టినప్పుడు మరుసటి రోజే తొలగించే కార్పొరేషన్ అధికారులు అధికార టీడీపీ పట్ల అతి ప్రేమ చూపుతూ పసుపు జెండాలు, తోరణాలను అలాగే ఉంచడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికారులు విజ్ఞతతో స్పందించి వైఎస్ విగ్రహాల వద్ద ఉన్న పసుపు పచ్చ జెండాలను, తోరణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు తొలగించక పోతే మంగళవారం ఉదయం 11 గంటలకు కడప – మైదుకూరు రోడ్డులో ఉన్న ఇర్కాన్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు.

అధికారులను సొంత పార్టీ పనులకు ఉపయోగించడం సిగ్గుచేటు

మహానాడు పూర్తిగా టీడీపీకి చెందిన సొంత కార్యక్రమం, అలాంటి సొంత పనులకు ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి ఇతర జిల్లా స్థాయి అధికారులు సైతం ఇదేదో ప్రభుత్వ కార్యక్రమం అన్నట్లు మహానాడు కార్యక్రమానికి టీడీపీ నాయకుల కంటే అధిక ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. మహానాడు వద్ద కేటాయించిన విధులకు హాజరయ్యేందుకు వస్తూ కటౌట్ విరిగి ఇద్దరు వీఆర్‌ఓలు తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు.

మహానాడు కాదది విద్రోహ నాడు

సూపర్ సిక్స్ హామీలంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన టీడీపీ సంవత్సర పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. సంవత్సరం పూర్తి కావచ్చినా ఇప్పటికీ ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ఆ పార్టీ పట్ల ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. దాని నుంచి ప్రజలను పక్కదోవ పట్టించడానికి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఇది మహానాడు కాదని, విద్రోహనాడని ఆయన ధ్వజమెత్తారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదంటూ తప్పుకునే ప్రయత్నం

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇదేమని పోలీసులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదని పోలీసు పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటున్నామంటూ సమాధానం చెబుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామంలో 120 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్నారు. సోమవారం ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన కూటమి నాయకుడు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఈ భూమి తమదని ఇక్కడి మట్టిని ఎవ్వరు తీసుకెళ్లేందుకు వీలు లేదని ఉపాధి కూలీలతో గొడవకు దిగారు. అయితే ఇది ప్రభుత్వ భూమి అని, ఇతరులకు సంబంధం లేదని కొంత మంది కూలీలు గోపాల్‌రెడ్డితో వాదించారు. అయితే ఉపాధి పనుల కోసం పంపిన ట్రాక్టర్ ఇంకా ఇంటికి రాలేదని ట్రాక్టర్ కోసం గ్రామ సర్పంచ్ రామలక్షుమ్మ భర్త రామమోహన్‌రెడ్డి పని వద్దకు వెళ్లాడు. ఎందుకు ఇక్కడ కంప అడ్డం వేశారని ప్రజలతో ఆరా తీస్తుండగా నీకెందుకు చెప్పాలి ఇది మా ప్రభుత్వం మా ఇష్టం వచ్చినట్లు చేస్తామంటూ గోపాల్‌రెడ్డి ఒక్కసారిగా అక్కడే ఉన్న కొడవలితో దాడి చేయబోయాడు. ఇంతలో రామమోహన్ రెడ్డి సోదరుడి కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి అడ్డుకోబోగా అతనిపై కూడా దాడి చేశాడు. పక్కనే ఉన్న మరో కూటమినేత ఎనమల వెంకటేశ్వరరెడ్డి కూలీలను మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న కూలీలు మరి కొంత మంది ఇదేమి అన్యాయం ఇది ప్రభుత్వ భూమి కదా మీకెందుకు భయపడాలంటూ ఎదురు తిరిగారు. దీంతో కూలీలను ఇష్టమొచ్చినట్లు తిడుతూ మీ అంతు చూస్తానని ఒక్కొక్కరిని నరుకుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై పవన్ కుమార్‌రెడ్డి పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. అయితే కూటమి నాయకుడు గోపాల్‌రెడ్డి జమ్మలమడుగు రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి తననే బెదిరించారంటూ అక్కడ లేని వ్యక్తులపై కూడా కేసు నమోదు చేయించారు. కాగా పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవాల్సి ఉండగా రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడం గమనార్హం.

ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న పోలీసులు..

చిన్న పసుపల గ్రామంలో జరిగిన గొడవ కేసులో ఇరువర్గాల ఫిర్యాదులను తీసుకుని కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మాత్రమే పెద్దముడియం పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపాల్ కేసు నమోదు చేశారు. అయితే తిరుపాల్ మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశాను తప్ప తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ విషయమై సీఐ గోపాల్‌రెడ్డిని వివరణ కోరగా తనకు ఆ కేసులో ఎలాంటి సంబంధం లేదని అది కేవలం పెద్దముడియం స్టేషన్ పరిధిలో ఉన్న పోలీసులకు మాత్రమే సంబంధించింది అని చెప్పారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం

మదనపల్లె సిటీ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు నేటికి నెరవేర్చలేదని ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం మదనపల్లె సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ విద్యా, వైజ్ఞానిక సదస్సులో పాల్గొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించాల్సిన ప్రభుత్వం వాటికి రెడ్ కార్పెట్ పరుస్తుందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వంలో విద్యలో కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. పాఠ్యాంశాలలో వాస్తవ చరిత్రను కాలరాస్తున్నారని చెప్పారు.


రామమోహన్


ప్రసన్నకుమార్

రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక..

ఎస్ఎఫ్ఐ సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడిగా పి.రామమోహన్, కార్యదర్శిగా కె.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు పావని, పరమేష్, వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ పాల్గొన్నారు.

సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌పై దాడి

మదనపల్లె రూరల్ : మండలంలోని కోళ్ల బైలు–2 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మోహన్ పై సోమవారం సాయంత్రం కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఘటనపై డిజిటల్ అసిస్టెంట్ మోహన్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు .... కోళ్ల బైలు –2 పంచాయతీ పరిధిలోని సోమశేఖర్ మరో ఇద్దరితో కలిసి సచివాలయానికి వచ్చి, తన ఇంటికి సంబంధించి పన్ను కట్టించుకోవాలని కోరాడు. ఇంటికి సంబంధించిన ధ్రువపత్రాలు సక్రమంగా లేకపోవడంతో పన్ను కట్టించుకోవడం కుదరదని డిజిటల్ అసిస్టెంట్ చెప్పాడు. దీంతో సోమశేఖర్ ఆవేశానికి లోనై, డిజిటల్ అసిస్టెంట్ మోహన్ పై దాడికి పాల్పడ్డాడు. తాను విధుల్లో ఉండగా దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాల్సిందిగా డిజిటల్ అసిస్టెంట్ మోహన్ ఫిర్యాదులో కోరాడు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లే లక్ష్యం


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడమే తన లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ప్రొద్దుటూరులో సోమవారం బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. బీసీలు అంతా ఏకమై బలమైన బీసీ ఉద్యమాలను నిర్మిస్తే బీసీల డిమాండ్లన్నీ సాధించుకోగలమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యలగాల నూకానమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, సహ అధ్యక్షుడు సందు శివనారాయణ, రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీవీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, జిల్లా యువజన అధ్యక్షుడు శివనారాయణ యాదవ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణయాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుభాన్‌బీ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డెయ్య, విజయకుమార్, గురప్ప, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టర్ మృతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – బద్వేలు రోడ్డులో చెన్నారెడ్డిపేట సమీపంలో సోమవారం ఉదయం మోటార్‌బైక్‌లో వెళుతున్న పెద్దిరెడ్డి వెంకటరెడ్డి (56)ని బొలెరో వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని కొండుగారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసేవారు. ఉదయం పని వద్దకు వెళ్లేందుకు బైక్‌లో వెళుతుండగా 4 వే లైన్స్ రోడ్డు పనికి చెందిన బొలెరో వాహనం అతివేగంగా వెనుక నుంచి ఢీ కొట్టి 50 మీటర్లు వెంకటరెడ్డిని బైక్‌తో సహా లాక్కొని వెళ్లింది. వెంకటరెడ్డి ప్రమాదంలో మృతి చెందిన వార్త తెలియడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు పెద్ద సంఖ్యలో జనం చేరుకున్నారు.